
సాక్షి
కుమురం భీం

సోమవారం ׀ 10 ׀ జూన్ ׀ 2024



తెలుగు-ఆంగ్లం సమేతంగా..
పదో తరగతి విద్యార్థులకు ద్విభాష(తెలుగు, ఇంగ్లిష్) పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నారు. గతంలో 9వ తరగతి వరకు ఈ పుస్తకాలు పంపిణీ చేశారు. 2లో▸



ఎండుతున్న 'అమ్మన్నమడుగు'
కెరమెరి మండలం కెస్లాగూడ సమీపంలోని అమ్మన్నమడుగు ప్రాజెక్టు నీరులేక వెలవెలబోతోంది. మత్తడి పూర్తిగా ఎండిపోయింది. 3లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
38.2 /28.2
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ప్రజావాణి

ఆసిఫాబాద్‌: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తుంటారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించడం, ఎన్నికల కోడ్‌తో మార్చి 18 నుంచి ప్రజావాణి కార్యక్రమానికి బ్రేక్ పడింది. సుమారు రెండు నెలల పాటు ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. ప్రస్తుతం పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తికావడంతో ఎన్నికల కోడ్ ఎత్తివేశారు. దీంతో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వెల్లడించారు. ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం అర్జీలు పెట్టుకోవచ్చని ఆయన సూచించారు.

అంబేద్కర్ ఆశయాలు సాధించాలి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్‌: బీఆర్ అంబేద్కర్ ఆశయాలు సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలన్నారు. రాజ్యాంగమే దేశాన్ని నడిపిస్తుందని పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాలు ప్రతీ గ్రామంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ్, అంబేద్కర్ గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ మార్కులు కలపాలని వేడుకోలు

ఆసిఫాబాద్‌: గ్రేస్ మార్కులు కలపాలని జిల్లాలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)కు హాజరైన విద్యార్థులు కోరుతున్నారు. గత నెల 5న నిర్వహించిన పరీక్షకు జిల్లాలో సుమారు 400 మంది హాజరయ్యారు. అయితే జిల్లా అధికారుల తప్పిదంతో ఆల్ ఇండియా స్థాయిలో ఒక సెట్ ప్రశ్నపత్రంతో పరీక్ష నిర్వహించగా.. జిల్లా విద్యార్థులకు మాత్రం మరో సెట్‌తో పరీక్ష నిర్వహించారు. ప్రశ్నపత్రం తారుమారైన విషయాన్ని విద్యార్థులు ఎన్‌టీఏ అధికారులతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు ప్రశ్నపత్రం 10 నిమిషాలు ఆలస్యంగా ఇచ్చినట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ నెల 4న నీట్ ఫలితాలు విడుదల కాగా.. ఇతర ప్రాంతాల్లో వారికి గ్రేస్ మార్కులు కలిపారు. అధికారుల తప్పిదం కారణంగా తమకు కూడా గ్రేస్ మార్కులు కలపాలని విద్యార్థులు కోట వంశీకృష్ణ, దాసరి దీపాన్వి, కీర్తనీయ ప్రీతం తదితరులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు తుకారాం, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్ పీఆర్‌సీ, ఏరియర్స్‌తో పాటు డీఏను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పోడు చిచ్చు!

కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామ శివారులో శనివారం అటవీశాఖ అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అటవీశాఖకు చెందిన భూమిలో హద్దులు ఏర్పాటు చేయడానికి వెళ్లిన అధికారులను తమకు పట్టాలు ఉన్నాయంటూ రైతులు అడ్డుకున్నారు. 30 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్నామని గ్రామస్తులు పేర్కొంటుండగా, అటవీ భూముల్లో హద్దులు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు వాదిస్తున్నారు.

ఆసిఫాబాద్ మండలం దానాపూర్ గ్రామంలో 150 ఎకరాలను 60 మంది రైతులు సుమారు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. రెండేళ్లుగా ఆ సాగు భూములు అటవీశాఖకు చెందినవి అంటూ రైతుల నుంచి స్వాధీనం చేసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పది రోజుల క్రితం భూములను స్వాధీనం చేసుకోవడానికి గ్రామానికి అటవీశాఖ అధికారులు వెళ్లగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వానాకాలం సీజన్ ప్రారంభం నేపథ్యంలో జిల్లాలోని పలు గ్రామాల్లో పోడు భూముల చిచ్చు రాజుకుంటోంది.



పెంచికల్‌పేట్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు(ఫైల్)

- వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందు ఘర్షణ వాతావరణం
- సాగు పనులు అడ్డుకుంటున్నారని రైతుల ఆగ్రహం
- అటవీ భూములకు హద్దులు గుర్తిస్తున్నామని అధికారుల వాదన
- అటవీ, రెవెన్యూ మధ్య సమన్వయ లోపంతో సమస్య తీవ్రతరం

పెంచికల్‌పేట్(సిర్పూర్): జిల్లాలో వానాకాలం సాగు పనులు ప్రారంభం కావడంతో గ్రామాల్లో రైతులు, అటవీశాఖ అధికారుల మధ్య పోడు భూముల వివాదం మళ్లీ మొదలైంది. వ్యవసాయ పనులను అధికారులు అడ్డుకుంటుండటంతో గిరిజనులు, అటవీశాఖకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో సాగు వద్దనడంపై రైతులు మండిపడుతున్నారు. ఏటా ఇబ్బందులు సృష్టిస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల కాలం నుంచి తమ ఆధీనంలో ఉన్న భూముల్లో సాగు పనులు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

15,254 మంది రైతులకు పట్టాలు

పోడు భూముల సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు మంజూరు చేసింది. వారికి భూమిపై పూర్తి హక్కులు కల్పించింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. జిల్లాలో 15,254 మంది గిరిజన రైతులకు 44,750 ఎకరాలలకు సంబంధించి పోడు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాల పంపిణీతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని భావించారు. అయితే గిరిజనేతర రైతులకు పట్టాల పంపిణీపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గిరజనేతరులకు పట్టాలు మంజూరు చేయకపోవడం, మరికొన్ని చోట్ల వివిధ కారణాలతో గిరిజనులకు సైతం నూతన పట్టాలు రాకపోవడంతో పోడు చిచ్చు తప్పడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అటవీ అధికారుల తీరుతో గ్రామాల్లో ఘర్షణ వాతావారణం నెలకొంటుంది.

అటవీశాఖ అధికారుల రంగ ప్రవేశంతో..

ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లోకి అటవీశాఖ అధికారుల రంగప్రవేశంతో గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. హరితహారం పేరుతో అటవీశాఖ భూములు స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతోంది. రైతులు, అటవీశాఖ మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో రోజురోజుకు సమస్య తీవ్రతరం అవుతుంది. రెండు శాఖల అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాల్సి ఉండగా.. ఏళ్లుగా అటువైపు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సీజన్ ప్రారంభంలో హడావుడి చేస్తున్న అధికారులు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పలు ప్రాంతాల్లో వివాదాలు

- పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి శివారులోని సర్వే నంబర్ 119లో 1,829 ఎకరాల్లో సుమారు 448 మంది రైతులు భూములు సాగు చేసుకుంటున్నారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఉమ్మడి సర్వే నిర్వహించకపోవడంతో గత ఐదేళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదు. వానాకాలం ప్రారంభం అయితే రైతులు, అటవీశాఖ అధికారుల మధ్య వివాదం ప్రారంభమవుతుంది.
- కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 145లో 70 మంది రైతులు 40 ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు సాగు పనులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.
- కాగజ్‌నగర్ మండలం అరెగూడ గ్రామానికి చెందిన రైతులు మోసం పంచాయతీ పరిధిలో అటవీశాఖ అధికారులు సాగు పనులు అడ్డుకుంటున్నారని కాగజ్‌నగర్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
- రెబ్బెన మండలం తుంగెడ గ్రామ శివారులోని సర్వే నంబరు 411, 427 సర్వే నంబర్లలో 42 ఎకరాల్లో రైతులు సాగు చేసుకుంటున్నారు. 20 రోజుల క్రితం సాగు పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. రైతులు, అటవీశాఖ అధికారులపై కేసు నమోదైంది.
- బెజ్జూర్ మండలం కొత్తగూడ(రెబ్బెన), చిన్న సిద్దాపూర్, బెజ్జూర్, ఎల్కపల్లి, సులుగుపల్లి, పాపన్‌పేట్ గ్రామాల్లో ప్రతీ సంవత్సరం సాగు పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు.
- చింతలమానెపల్లి మండలంలోని గూడెం, ఆడెపల్లి, గంగాపూర్, ఖర్జెల్లి, కోసిని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న భూముల్లో అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు.

సర్వే నిర్వహించాలి



ఐదేళ్లుగా పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామంలో అటవీ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించడం లేదు. ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నాం. సీజన్‌లో సాగు పనులు ప్రారంభిస్తే అటవీశాఖ అధికారులు అటవీ భూముల పేరుతో పనులు అడ్డుకుంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కొండపల్లి గ్రామంలో భూ సమస్య పరిష్కరించాలి.

– ఆత్రం సిద్దు, రైతు, కొండపల్లి

రేపు వానాకాలం సాగుపై ఫోన్ ఇన్



రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆసిఫాబాద్‌: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. జిల్లాలోని రైతాంగం ఏ సమయంలో విత్తనాలు విత్తుకోవాలి. పత్తి, సోయా, కంది వంటి పంటల సాగుకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులను ఏ మేరకు వినియోగించాలి. నకిలీ విత్తనాల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై 'సాక్షి' ఈ నెల 11న మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావుతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. జిల్లాలోని రైతులు జిల్లా వ్యవసాయాధికారిని ఫోన్‌లో సంప్రదించి, తమ సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం కల్పిస్తుంది.

రైతులు సంప్రదించాల్సిన నంబర్ : 72888 94022
సమయం: మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు

శివాజీ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో జెడ్పీ చైర్మన్ కృష్ణారావు

దహెగాం(సిర్పూర్): మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ కృష్ణారావు మాట్లాడారు. శివాజీ గొప్ప మహనీయుడని, ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం తాలుకా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుబ్బుల వెంకన్న, ఎంపీపీలు కంబగౌని సులోచన, దుబ్బుల నానయ్య, నాయకులు నారాయణ, లచ్చన్న, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

చెస్‌ను మరింత విస్తరించాలి



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): చెస్ క్రీడను మరింత విస్తరించాలని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారుల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చెస్ గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులకు సైతం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో నెల రోజులపాటు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే చెస్‌పై ఆసక్తి చూపాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య, జిల్లా అధ్యక్షుడు సామిల్ల సంపత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ప్రధాన కార్యదర్శి కల్పన, సంయుక్త కార్యదర్శి రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, తిరుపతి, శృతిక, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఉమ్మడి జిల్లాస్థాయిలో అండర్– 9, 11, 13, 15, ఓపెన్‌టూ ఆల్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతల జాబితాను జిల్లా అసోసియేషన్ సభ్యులు ప్రకటించారు. అండర్– 9 విభాగంలో ఏ.దేవాన్స్, ఎం.శ్రీతన్, పి.సహర్ష, ఏ.తన్విక, అండర్– 11లో బి.భార్గవ్, కార్తికేయ చారి, పి.మేఘన, ఎం.క్రిషిక, అండర్– 13లో డి.జాన్సన్, ఈ.కౌశిక్, ఎస్.వల్లభ్, అండర్– 15లో ఎస్.సాయివర్షిత్, టి.రుద్రధ్రువన్, ఎం.ప్రహర్షవర్ధన్, ఓపెన్ టూ ఆల్ విభాగంలో ఈ.యశ్వంత్, పి.శివకృష్ణ, ఎస్.నవనీత్, ఎస్.సత్య విజేతలుగా నిలిచారు.

ఆలస్యం.. ఆపై నిర్లక్ష్యం!



బంబార యూటర్న్ వద్ద రోడ్డు పరిస్థితి

- ఏడాదికే కుంగిన జాతీయ రహదారి– 363
- నాసిరకం పనులపై సర్వత్రా విమర్శలు
- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం
- పర్యవేక్షణలో యంత్రాంగం విఫలం

వాంకిడి(ఆసిఫాబాద్): అందమైన రహదారి, డివైడర్లపై రంగురంగుల పూలమొక్కలు, ఇరువైపులా పచ్చని చెట్లు, గ్రామాల్లోనూ ఫ్లైవర్లు, అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు, లైటింగ్ హంగులు.. ఇదీ నాలుగు వరుసల జాతీయ రహదారి చిత్రం. రహదారి వెంట పల్లెలు సైతం పట్టణ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. అయితే పైపై అందాలతో చూపరులను ఆకట్టుకుంటున్న ఈ రహదారి నిర్మాణం పూర్తయిన ఏడాదికే అనేకచోట్ల దెబ్బతింది. నాసిరకం పనులతో నాణ్యత తేటతెల్లమవుతుంది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెబ్బెన మండలం రేపల్లెవాడ నుంచి వాంకిడి మండలం మహారాష్ట్ర సరిహద్దున గోయెగాం వరకు 52 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి– 363 నిర్మించారు. ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో చేపట్టిన పనులు ప్రస్తుతం వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి.

నిర్మాణం ఇలా..

భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి రవాణా సౌలభ్యం కల్పించేందుకు దేశంలోని అనేకచోట్ల ఫోర్ లేన్ జాతీయ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఎన్‌హెచ్– 363 ప్రాజెక్టు ప్యాకేజీ– 1లో మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ నుంచి రేపల్లెవాడ వరకు, ప్యాకేజీ– 2లో రేపల్లెవాడ నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన గోయెగాం వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. 2021లో ప్యాకేజీ– 2 కింద 52 కి.మీ.ల రహదారి నిర్మాణానికి ముందుగా రూ.1,140 కోట్లు మంజూరు చేశారు. అనంతరం పెరిగిన విలువల ప్రకారం నిర్మాణ వ్యయం మొత్తం రూ.1,200 కోట్లకు చేరింది. డీబీఎల్ కంపెనీ ఈ పనులను చేపడుతుండగా.. ఏళ్లు గడిచినా పలుచోట్ల అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నత్తనడక పనులతో ఇచ్చిన గడువు ముగిసినా.. ఎన్‌హెచ్ అధికారులు సదరు గుత్తేదారుకు సహకరిస్తుండటంతో ఏళ్లుగా పనులు పూర్తి కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పలుచోట్ల ఇంకా సైడ్ డ్రైయిన్ పనులు, సర్వీస్ రోడ్లకు లైటింగ్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.



ఎకో బ్రిడ్జి వద్ద సైడ్‌డ్రెయిన్‌కు రంధ్రం



కోతకు గురైన ఆర్లీ రోడ్డు

పనుల్లోనూ జాప్యం..

2020లో ప్రారంభమైన ఎన్‌హెచ్– 363 నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. వాంకిడి, రెబ్బెన మండలాల్లో పలుచోట్ల సైడ్ డ్రెయిన్‌లు, సర్వీస్ రోడ్లపై లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. గుత్తేదారు నిబంధనలు పాటించకపోవడం, జాప్యంతో మూడేళ్ల వ్యవధిలో వందలాది మంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. 2023 ఫిబ్రవరిలో పనులు పూర్తి కావాల్సి ఉండగా.. 2024 జనవరి వరకు గడువు పొడగించారు. ఇచ్చిన అదనపు గడువు సైతం ముగిసింది. వాంకిడిలో ప్రధాన మార్కెట్ ఏరియాలో అండర్‌పాస్ వద్ద మురుగు నీరు వెళ్లేందుకు రహదారి కింద నుంచి సక్రమంగా నాలా తీయలేదు. భారీ వర్షాలకు వరద వ్యాపార సముదాయాల్లో నిలిచే అవకాశాలు ఉన్నాయి. బంబార సమీపంలో ఆర్లీకి వెళ్లే లింక్ రోడ్‌కు బెల్ మోత్‌గా కొంత బీటీ వేయాల్సి ఉండగా అలాగే వదిలేశారు. ఆ గ్రామంలో బస్ షెల్టర్, రహదారి గుండా స్ట్రీట్ లైట్లు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. ఎన్‌హెచ్ – 363 నిర్మాణంలో జరిగిన నాసిరకం పనులపై ఎన్‌హెచ్‌ఏఐ పీడీ అజయ్ మణికుమార్‌కు ఫోన్ ద్వారా సంప్రదించగా.. సైట్ ఇంజనీర్లతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏడాదికే కుంగిన రోడ్డు

జాతీయ రహదారిని పరిశీలిస్తే అనేక ప్రాంతాల్లో నాణ్యత ప్రమాణాలు తేలిపోతున్నాయి. వాంకిడి మండలం బంబార గ్రామ సమీపంలో నియూటర్న్ వద్ద ఫోర్ లేన్ అధ్వానంగా మారింది. రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో నిర్మించిన ఏడాదికే కుంగిపోతుంది. వాహనాల బరువుకు రోడ్డుపై టైర్ల గుర్తులు పడుతున్నాయి. దాదాపుగా ఇంచుల వరకు రోడ్డు కుంగిపోయింది. రహదారి గుండా పరిశీలిస్తే అనేక చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తుంది. నిత్యం వందల సంఖ్యలో గూడ్స్ వాహనాలు మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు కుంగిపోయిన ప్రాంతాల్లో అదుపు తప్పితే భారీ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. రూ.వేల కోట్లు పెట్టి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మిస్తుండగా.. కిందిస్థాయి అధికారులు మాత్రం గుత్తేదారుకు వత్తాసు పలుకుతూ పర్యవేక్షణ మరుస్తున్నారు. సదరు గుత్తేదారుకు కేంద్రస్థాయి రాజకీయ నాయకుల అండ ఉండటంతో నిర్మాణ సమయంలో జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సైతం నోరు మెదపలేకపోయారని ప్రచారం జరుగుతోంది. మహారాష్ట్ర సరిహద్దులో ఎకో బ్రిడ్జి వద్ద నిర్మించి సైడ్‌డ్రెయిన్‌పై స్లాబుకు పెద్దరంధ్రం ఏర్పడింది. వాంకిడి, రెబ్బెన మండల కేంద్రాల్లోనూ సైడ్ డ్రెయిన్ పనులు నాసిరకంగా చేపట్టడంతో ఏడాదికే శిథిలమవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. బెల్‌మోత్ రోడ్డు వేయకపోవడంతో కోతకు గురైన ఆర్లీ రోడ్డు కోతకు గురైంది. నాణ్యతతో కూడిన మట్టి వాడకపోవడం, సరిగ్గా రోలింగ్ చేయకపోవడంతో రహదారి కుంగిపోతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశాంతంగా గ్రూపు –1 ప్రిలిమ్స్



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న ఎస్సై

- పరీక్షకు 2,258 మంది హాజరు.. 525 మంది గైర్హాజరు
- పలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలో ఆదివారం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్– 1 ప్రిలిమ్స్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల తర్వాత కేంద్రాల్లోకి అనుమతించమని ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులు 9 గంటల వరకే సెంటర్లకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. మొత్తం 13 పరీక్ష కేంద్రాల్లో ఆసిఫాబాద్‌లో 6, కాగజ్‌నగర్‌లో 7 ఏర్పాటు చేశారు. 2,783 మంది అభ్యర్థులకు 2,258 మంది హాజరు కాగా.. 525 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఫొటోలు లేకుండా వచ్చారు. మళ్లీ వెళ్లి ఫొటోలతో వారు కేంద్రానికి చేరుకునేసరికి ఉదయం 10.10 గంటలు దాటింది. దీంతో వారిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకులం, కాగజ్‌నగర్‌లోని వసుంధర డిగ్రీ కళాశాల, సెయింట్ క్లారెట్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి జిల్లా కేంద్రంలోని చైతన్య కళాశాలను తనిఖీ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కేంద్రాలను అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ పర్యవేక్షించారు. పట్టణ సీఐ శంకరయ్య, కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సైలు మహేందర్, మధుకర్ బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

కండక్టర్‌కు గుండెపోటు



బాసర ప్రభుత్వ ఆస్పత్రిలో నేలపై కండక్టర్

బాసర: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కండక్టర్ శోభన్‌కు ఆదివారం గుండెపోటుకు గురయ్యాడు. బస్ డ్రైవర్ వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నేలపై కండక్టర్ ఉన్నా నర్సులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ రమేశ్ తన కారులో భైంసా ఏరియాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, పశువుల కొట్టం దగ్ధం



కాలిపోయిన ఇల్లు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి 2 గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో కవల్కర్ లక్ష్మి ఇల్లు, కవల్కర్ సురేష్‌కు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. చుట్టు పక్కలవారు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. వారు అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఆర్‌ఐ సాయిప్రసాద్ పంచనామా నిర్వహించారు. కవల్కర్ లక్ష్మికి చెందిన 4 తులాల బంగారు, రూ.4 లక్షల నగదు, 5 క్వింటాల్ బియ్యం, నిత్యావసరాలు, టీవీ, మంచాలు దగ్ధమైంది. కవల్కర్ సురేష్‌కు సంబంధించి పశువల కొట్టంలో 40 బస్తాల డీఏపీ, 70 బస్తాలు యూరియా, వరి గడ్డి కాలిబూడిదైంది. సుమారు రూ.1.50 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

కారు ఢీకొని నీలుగాయ్ మృతి



మృత్యువాతపడ్డ నీల్‌గాయ్

దిలావర్‌పూర్: కారు ఢీకొని నీలుగాయ్ మృతిచెందింది. మండలంలోని కాల్వ నరసింహ స్వామి ఆలయ స్వాగత తోరణం వద్ద ఆదివారం తెల్లవారుజాము ఈ ఘటన చోటుచేసుకుంది. భైంసా వైపు నుంచి వస్తున్న కారు వెళ్తుండగా అడ్డంగా నీలుగాయ్ రావడంతో ఢీకొట్టింది. దీంతో దూరాన పడి మృత్యువాతపడింది. కారును అధికారులు రోడ్డు పక్కన ఉంచారు. ఎఫ్‌ఎస్‌ఓ ఫారూఖ్ అలీ, ఎఫ్‌బీఓ మీనాలు నీలుగాయ్‌కి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. దిలావర్‌పూర్ పోలీసులు సైతం పరిశీలించారు.

అస్వస్థతతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుడు ఏముర్ల రాజయ్య (56) శనివారం అస్వస్థతకు గురై మృతిచెందాడు. అమరవాది గ్రామానికి చెందిన రాజయ్య శనివారం అమ్మాగార్డెన్స్ ఏరియాలో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. అతన్ని తోటి కార్మికులు ఇంటి వద్ద విడిచిపెట్టగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు 108లో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దహనసంస్కారాలకు కాంగ్రెస్ నాయకులు రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

తెలుగు-ఆంగ్లం సమేతంగా..

- ద్విభాష పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం
- ఈ విద్యా సంవత్సరం నుంచే 'పది'విద్యార్థులకు..
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రయోజనం


నిర్మల్‌ఖిల్లా: మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ ప్రభుత్వ విద్య ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. ఆంగ్ల మాధ్యమం ద్వారా ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించే అవకాశం ఉంది. ఇందుకుగాను పాఠ్యాంశాల రూపకల్పనలో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలో గత మూడేళ్ల క్రితం నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. ఏటా ఒక్కో తరగతి పెంచుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం బోధించనున్నారు. గతంలో సక్సెస్ పాఠశాలల పేరిట కొన్ని ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఆంగ్ల మాధ్యమ బోధన కొనసాగించారు. 2022–23 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం ప్రారంభించారు. విద్యార్థులు పాఠాలు తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు. ఇందులోభాగంగా పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాన్ని ఒక పక్క తెలుగు, మరోవైపు ఆంగ్లంలో ముద్రించడం విశేషం.

పంపిణీకి ఏర్పాట్లు

మరో రెండు రోజుల్లో పాఠశాలల బడి గంటలు మోగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి ద్విభాష పాఠ్యపుస్తకాలు పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకోగా, మండలాల్లోని పాఠశాలలకు పంపిణీ ప్రక్రియ జరుగుతోంది. అయితే గత విద్యాసంవత్సరం వరకు 9వ తరగతి వరకు ద్విభాష (తెలుగు, ఆంగ్ల భాషలో) ప్రచురితమైన పుస్తకాలు పంపిణీ చేయగా, ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు ఆ మాదిరిగా పుస్తకాలు అందజేయనున్నారు.



ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయనున్న పాఠ్యపుస్తకాలు



రెండువైపులా రెండుభాషల్లో ముద్రితమైన పాఠ్యాంశంలోని పేజీ(ఫైల్)

రెండు విభాగాలుగా పుస్తకాలు..

ప్రతి పుస్తకాన్ని ఆంగ్లం, తెలుగులో ముద్రిస్తే పుస్తకం పేజీల సంఖ్య రెట్టింపై విద్యార్థులకు బరువు పెరగకుండా రెండు విభాగాలుగా విభజించారు. పార్ట్–1, పార్ట్–2 పేరిట విభజించిన రెండు పుస్తకాలను జూన్ నుంచి అక్టోబర్ వరకు మొదటి భాగం, నవంబర్ నుంచి మార్చి వరకు రెండవ విభాగాలుగా విద్యార్థులకు, ఈ సంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నారు. తద్వారా ద్విభాషా పాఠ్యపుస్తకాల వల్ల విద్యార్థులు సులభతరంగా నేర్చుకునేందుకు వీలుంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో పాఠ్యాంశాలు..

తెలుగు మాధ్యమం నుంచి వచ్చిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం చదవాలంటే కొంత ఇబ్బందిగా ఉంటుందని భావించిన విద్యాశాఖ ప్రతి పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషా పుస్తకాలు కాకుండా గణితం, సామాన్య, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలు ఎడమవైపు పేజీలో తెలుగులో, కుడివైపు పేజీలో అదే పాఠ్యాంశాన్ని ఇంగ్లిష్‌లో ముద్రణ చేయించారు. ఇక ప్రాథమిక స్థాయినుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాల్లో రెండు మాధ్యమాల్లో సులభంగా చదువుకునే అవకాశం ఉంది. ఇది విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉండనుంది.

కొత్త హంగులతో పుస్తకాలు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పుస్తకాలు కొత్త హంగులతో రూపొందించారు. ఆకట్టుకునే చిత్రాలు, కవర్ పేజీలతో ఉండనున్నాయి. పేజీలోని పాఠం పూర్తి వివరాల కోసం, సంబంధిత వీడియోల కోసం అక్కడ క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. మొబైల్‌తో స్కాన్ చేయగానే అదనపు సమాచారంతో కూడిన వీడియో, ఫోటోలు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇవి విద్యార్థులకు సరికొత్త ఆకర్షణీయంగా ఉన్నాయి.

పంపిణీకి ఏర్పాట్లు



ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పుస్తకాల ముద్రణ పూర్తయింది. పాఠశాల ప్రారంభం రోజునే పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోధన అభ్యసన ప్రక్రియ సులువవుతోంది.

– డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి, డీఈవో

విద్యార్థులకు అవగాహన సులభం



గ్రామీణప్రాంత విద్యార్థులకు పాఠం అవగాహన కోసం సులభతరం అవుతోంది. ద్విభాషా పుస్తకాల విధానం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు తోడ్పడుతుంది. ఉపాధ్యాయులకు ప్రయోజనం. పుస్తకాలు రెండు పార్ట్‌లుగా ఉండటం వల్ల విద్యార్థులపై భారం ఉండదు.

– మైస అరవింద్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, పొన్కల్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బోథ్: మండలంలోని పూల్‌సింగ్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ భాస్కర్(58) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాము కథనం ప్రకారం.. భాస్కర్ కుటుంబ పోషణ కోసం రూ.2 లక్షల అప్పు చేశాడు. ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి..

తిర్యాణి: మండల కేంద్రానికి చెందిన ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన చిన్న పోషయ్య (55) మంచిర్యాల జిల్లా మందమర్రిలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, తిర్యాణిలో ఆయనకు సంబంధించిన వ్యవసాయ భూములు ఉండటంతో వాటిని చూసుకునేందుకు మూడు రోజుల క్రితం ఇక్కడే ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్‌సాగర్ (చెలిమల) ప్రాజెక్టు కాలువ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

వాగులో పడి పశువుల కాపరి మృతి

రెబ్బెన: మండలంలోని నంబాల పరిధిలో గల మన్నెగూడకు చెందిన టేకం శంకర్ (52) ఆదివారం ప్రమాదవశాత్తు గోలేటి వాగులో పడి మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గోలేటి పరిధిలోని దుర్గాపూర్‌కు చెందిన నాందేవ్ వద్ద పశువుల కాపరిగా శంకర్ పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా ఉదయం మేత కోసం గోలేటి వాగు పరిసరాలకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. తోటి కాపరులు గమనించి నాందేవ్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని శంకర్‌ను ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుమారుడు విలాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



నాగ్‌నాథ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని సట్వాజీగూడ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం మామిడిపల్లికి చెందిన నాగర్‌గోజే నాగ్‌నాథ్(35)కు ఆదిలాబాద్ జిల్లా సట్వాజీగూడకు చెందిన పార్వతితో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా పార్వతి కొన్ని రోజులుగా పుట్టింట్లో ఉంటుంది. నాగ్‌నాథ్ ఆదివారం సట్వాజీగూడకు వచ్చాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది అత్తగారి వ్యవసాయ చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు 108లో రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మద్యం మత్తులో యువకుడి..

బేల: మండలంలోని చప్రాల గ్రామంలో యువకుడు తిరస్కార్ వినోద్(20) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై కినక జీవన్ కథనం ప్రకారం.. వినోద్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి ఇంటి వద్ద మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి, ఇరుగుపొరుగువారు రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి, మృతిచెందాడు. తల్లి సంగీత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఉరుకులు.. పరుగులు







ఆదిలాబాద్‌లో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్షకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో అభ్యర్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. చివరి నిమిషాల్లో సమయం మించిపోతుండడంతో మరికొందరు ఇలా ఉరుకులు పరుగులు పెడుతుండగా 'సాక్షి'క్లిక్ మనిపించింది.– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కేంద్రం చిరునామా తెలియక..





నిర్మల్‌లో గ్రూప్–1 పరీక్ష కోసం కేటాయించిన కేంద్రం చిరునామా తెలియక అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. కేంద్రానికి ఆలస్యంగా చేరుకోవడంతో అనుమతించలేదు. పోలీసు కార్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రెండింటి ప్రవేశ ద్వారాలు ఒకటే ఉండడంతో గందరగోళానికి గురయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా



నవనీత్



చరణ్ తేజ్



అఖిల్



శివ

- జిల్లా నుంచి పలువురు విద్యార్థులకు ర్యాంకులు
- విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే వినోద్, ఆర్సీఓ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి మెరిశారు. ఈసారి 9 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, ఆడే నవీన్ 1171 ర్యాంకు తెచ్చుకుని కళాశాల టాపర్‌గా నిలవగా, మిగతా ముగ్గురిలో దుర్గం చరణ్‌తేజ్ 2778, వెలుతురు అఖిల్ 3679, రాంటెంకి శివ 7476 జాతీయ ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. జేఈఈలో క్వాలీఫై అయిన సదరు విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్‌లో సాధించిన ర్యాంకు ప్రాతిపదికన ఐఐటీలో సీటు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

సదరు విద్యార్థులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ఫోన్ ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా సీఓఈ ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులను ప్రశంసించారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, అధ్యాపకులు నాగిని శ్రీరామ వర్మ, పిన్నింటి కిరణ్, చందా లక్ష్మీనారాయణ, మిట్టా రమేశ్, కట్ల రవీందర్, ముద్దసాని శోభ, ఆవునూరి రవి, అల్లూరి వామన్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



చంటి



సాయికృష్ణ

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని టీటీడబ్ల్యూ ఆర్‌జేసీ (బాలుర) కళాశాలలో కొనసాగుతున్న స్టార్ 50లోని పలువురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించారు. ఇందులో పి.చంటి ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 422 ర్యాంకు, ఎస్.సాయిక్రిష్ణ ఎస్టీ కేటగిరీలో 743వ ర్యాంకు జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబర్చారు. శివ కుమార్ నీట్‌లో ఎస్సీ కేటగిరీలో 40,887 ర్యాంకు సాధించారు. మరికొందరు ఈఏపీసీఈటీ, ఎన్ఐటీ రంగాల్లో సీట్లు సాధించనున్నట్లు స్టార్ 50 కోఆర్డినేటర్ మారుతి శర్మ తెలిపారు.

ఉట్నూర్‌లో..



ఇంద్రవెల్లి: ఉట్నూర్ మండలం నర్సాపూర్‌కు చెందిన చవాన్ జైవంత్‌రావ్, అలిమా దంపతుల కుమార్తె మేఘ్న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 68 ర్యాంకు సాధించారు. విద్యార్థిని ఈ ప్రాంత ప్రజలు అభినందించారు.

నర్సాపూర్(జి)లో..



నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన విశ్వక్‌సేన్ జేఈఈ (అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1833 ర్యాంక్ సాధించాడు. తండ్రి నరేందర్ ప్రభుత్వ టీచర్ కాగా, తల్లి అనురాధ గృహిణి.

నిర్మల్‌లో..



నిర్మల్‌ఖిల్లా: ఇంద్రానగర్‌కు చెందిన గుర్రం రమాదేవి–వేణుగోపాల్ దంపతుల కుమార్తె సాయి మనోజ్ఞ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 2,514 జాతీయస్థాయి ర్యాంకు సాధించింది. ఆమెను పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్ దంపతులు సన్మానించారు.

ఆదిలాబాద్‌లో..



ఆదిలాబాద్‌టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచా టారు. గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన టీచర్ శివకుమార్–గీతా రాణి దంపతుల కుమారుడు కార్తీక్ ఓబీసీ కేటగిరిలో 1794వ ర్యాంక్ సాధించాడు. అదేవిధంగా నవీన్ యాదవ్–రమాదేవి దంపతుల కుమార్తె సిరి జాతీయ స్థాయి ఓబీసీ కేటగిరిలో 2236వ ర్యాంక్ సాధించింది.

వాంకిడిలో..



వాంకిడి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన దుర్గం అర్జున్ ప్రతిభ చాటారు. ఆలిండియా స్థాయిలో 1782వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు దుర్గం మహేందర్–జ్యోతి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, కళాశాల సిబ్బంది అర్జున్‌ను అభినందించారు.

విజయరాజ్‌కు 210వ ర్యాంకు



జన్నారం/లక్ష్మణచాంద: జన్నారం వాసి, లక్ష్మణచాంద లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎం భుక్య రాజునాయక్–రూప దంపతుల కుమారుడు విజయరాజ్ జేఈఈ (అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 210 ర్యాంక్ సాధించాడు. విజయ్‌రాజును పలువురు అభినందించారు.

అ'పూర్వ' సమ్మేళనం



చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి స్థానిక సంతోషిమాత ఫంక్షన్ హాల్ వేదికైంది. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురువులను సన్మానించారు.



రామకృష్ణాపూర్: పట్టణంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 34 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా మొదటగా పాఠశాలలో కలుసుకుని అక్కడి నుంచి ర్యాలీగా క్లబ్‌కు చేరుకున్నారు. డీజే సౌండ్స్‌కు స్టెప్పులు వేస్తూ ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.



లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్ననాటి గుర్తులను నెమేరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.